క్లుప్తంగా

ఉద్యోగాలకు ఆదిత్య విద్యార్థులు ఎంపిక

టెక్కలి: టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన పలువురు విద్యార్థులు టెస్సోల్వ్ సెమీ కండక్టర్ కంపెనీలో ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల డైరెక్టర్ వి.వి.నాగేశ్వరరావు శుక్రవారం తెలిపారు. ఏడాదికి 4.2 లక్షల రూపాయల వేతనంతో ఉద్యోగాలకు ఎంపికైనట్లు వెల్లడించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

టెక్కలి: టెక్కలి మండలంలోని పలు గ్రామాలకు శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఈఈ నరసింహకుమార్ శుక్రవారం తెలిపారు. పోర్టు రోడ్డులో విద్యుత్ లైన్ల మార్పు కారణంగా తలగాం, బిర్లంగిపేట, రెయ్యిపేట, బంజీరుపేట, పెద్దరోకళ్లపల్లి, సీతారాంపల్లి, రామనగరం గ్రామాల కు ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని.. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

నేడు టెక్కలి మండలంలో రచ్చబండ-సంతకాల సేకరణ

టెక్కలి: మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైఎస్సార్‌సీపీ తలపెట్టిన రచ్చబండ-కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని శనివారం టెక్కలి మండలంలో నిర్వహిస్తున్నట్లు పార్టీ మండల అధ్యక్షుడు హనుమంతు వెంకటేశ్వరరావు శుక్రవారం తెలిపారు. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్ ఆధ్వర్యంలో కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. పాతనౌపడ, తలగాం, తేలినీలాపురం గ్రామాల్లో ఉదయం తొమ్మిది గంటల నుంచి కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

పోస్టల్ ఉద్యోగుల నిరసన

పలాస: కేంద్ర ప్రభుత్వ కక్షసాధింపు చర్యల్లో భాగంగా ఉద్యోగం నుంచి తొలగించిన తపాల ఉద్యమ జాతీయ నాయకుడు మహాదేవయ్యను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని ఆలిండియా గ్రామీణ డాక్ సేవక్ యూనియన్, తపాల ఉద్యోగుల సంఘ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు కాశీబుగ్గ సబ్ డివిజన్ పోస్టాఫీస్ కార్యాలయం వద్ద శుక్రవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. సంఘం నాయకులు నందికేశ్వరరావు, కె.రాజేష్, జె.రాము, భాస్కర్‌రావు, కిరణ్‌కుమార్, తులసీకృష్ణ, వెంకటరమణ, జోగి చరన్ పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనాలు పరిశీలన

కంచిలి: మఠం సరియాపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం నిర్వహణ అస్తవ్యస్తంగా ఉందని వచ్చిన ఆరోపణల మేరకు మండల అధికారులు శుక్రవారం సందర్శించారు. వడ్డించే విధానంలో లోపాలను గుర్తించి, వాటిని సరిచేసే ప్రయత్నం చేశారు. కట్టెల పొయ్యి వద్దే పిల్లలకు వడ్డించే ప్రక్రియకు స్వస్తి చెప్పించి, తరగతి గది వరండాలో టేబుల్ వేసి వరుస క్రమంలో వడ్డించే పద్ధతిని ప్రారంభించారు. ఆహార పదార్థాల నాణ్యత కూడా కచ్చితంగా పాటించాలని సూచించారు. పరిశీలనలో స్థానిక ఎంపీడీవో వి.తిరుమలరావు, ఎంఈవోలు ఎస్.శివరాంప్రసాద్, కె.చిట్టిబాబు ఉన్నారు.

వీవోఏలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

వజ్రపుకొత్తూరు రూరల్: ప్రభుత్వ పథకాలు ప్రజల్లోకి తీసుకువెళ్లడం, డ్వాక్రా సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేయడంతో పాటు సామాజిక కార్యక్రమాలు చేస్తున్న వీవోఏలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని శ్రామిక మహిళ నాయకురాలు బి.సుగుణ, సీఐటీయూ మండల కన్వీనర్ ఎన్.మోహన్‌రావులు కోరారు. ఈ మేరకు నగరంపల్లిలో శుక్రవారం విలేకర్లతో మాట్లాడుతూ.. వీవోఏలకు కనీస వేతనంగా రూ. 26 వేలు అందించాలని, బీమాను ప్రభుత్వమే చెల్లించాలన్నారు.

భవనాలను పరిశీలించిన సుడా పీవో

సోంపేట: మండల కేంద్రంలోని బిరుసువాడ సమీపంలో అనుమతుల్లేకుండా బహుళ అంతస్తుల భవన నిర్మాణం చేపడుతున్నారని పలాసపురం సర్పంచ్ తడక జోగారావు హైకోర్టులో కేసు వేయగా.. మూడు వారాలు నిర్మాణాలు ఆపాలని కోర్టు ఆదేశించింది. ఈ నేపథ్యంలో ఈ భవన సముదాయాన్ని సుడా పీవో అమర్నాథ్, సిబ్బంది శుక్రవారం పరిశీలించారు.

రైటప్:10ఎస్ఎంపి81,81ఎ-280058: భవనాన్ని పరిశీలిస్తున్న సుడా పీవో అమర్నాథ్, సిబ్బంది

ఉన్నత పాఠశాలలో సమస్యల తిష్ట!

- సక్రమంగా సాగని చదువులు
- మఠం సరియాపల్లి పాఠశాలలో పరిస్థితి

కంచిలి:

మఠం సరియాపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో సమస్యలు తిష్ట వేశాయి. దీంతో చదువులు సక్రమంగా సాగడం లేదని విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా ఉపాధ్యాయులు విద్యార్థులను గాలికొదిలేశారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఎటువంటి క్రమశిక్షణ లేకపోవడం, తరగతులు సక్రమంగా సాగకపోవడం, పాఠశాల నిర్వహణ, పరిశుభ్రత వంటివి బాగోలేవు. మధ్యాహ్న భోజనం నిర్వహణ దారుణంగా తయారైంది. ఆర్వో ప్లాంట్లు పాడైనప్పటికీ వాటికి మరమ్మతులు చేపట్టకపోవడంతో ట్యాప్ నుంచి వచ్చే నీటినే విద్యార్థులు తాగుతున్నారు. పాఠశాలలో 401 మంది అభ్యసిస్తున్నారు. వీరికి బోధన చేసేందుకు 22 మంది ఉపాధ్యాయులను నియమించారు. కానీ వీరిలో కొందరు నిత్యం గైర్హాజరవ్వడంతో చదువులు సక్రమంగా సాగడం లేదని విద్యార్థులు, గ్రామస్తులు చెబుతున్నారు.

సౌకర్యాల కొరత

అరు నుంచి పది తరగతులకు అన్ని మీడియంలు కలిపి 15 సెక్షన్లు ఉండగా.. కేవలం పది మాత్రమే తరగతి గదులు ఉన్నాయి. మరో ఐదు గదులు అవసరం ఉంది. ఉన్న గదులు కూడా అపరిశుభ్రంగా ఉన్నాయి. కిటికీల్లోంచి పావురాలు గదుల్లోకి ప్రవేశించి, రెట్టలు వేసి చిందరవందర చేయడంతో దుర్వాసన వెలువడుతోందని పిల్లలు వాపోతున్నారు. ఉన్న ఇద్దరు స్వీపర్లు కూడా సక్రమంగా పని చేయడం లేదనే విమర్శలు ఉన్నాయి. అలాగే గత ప్రభుత్వ హయాంలో నాడు-నేడు పథకంలో భాగంగా రెండో విడతలో పాఠశాల భవనానికి నిధులు మంజూరు చేశారు. గ్రౌండ్ ఫ్లోర్, మొదటి ఫ్లోర్ శ్లాబ్‌లు మాత్రమే పూర్తయ్యాయి. మిగతా నిర్మాణం పూర్తి కాకపోవడంతో వసతి సమస్య నెలకుంది.



కట్టెలపొయ్యి పక్కనే వడ్డిస్తున్న వంట ఏజెన్సీ నిర్వాహకురాలు

రుచిలేని మధ్యాహ్న భోజనం..

మధ్యాహ్న భోజనం రుచిగా ఉండడం లేదని విద్యార్థులు వాపోతున్నారు. వంటకంలో నాణ్యతా ప్రమాణాలు పాటించడం లేదంటున్నారు. ఇక్కడ గ్యాస్ స్టౌపై కాకుండా కట్టెల పొయ్యి మీద వంటలు చేస్తుండటం గమనార్హం.

అదుపు తప్పిన పాఠశాల నిర్వహణ

పాఠశాల నిర్వహణను సరిచేయడంలో మేనేజ్‌మెంట్ పూర్తిగా విఫలమైందనే విమర్శలు వస్తున్నాయి. తాము సమస్యలు ఎదుర్కొంటున్నామని.. పరిష్కరించాల్సిందిగా ప్రధానోపాధ్యాయునికి, మిగతా సిబ్బంది దృష్టికి తీసుకెళ్లిన సందర్భాలు ఇక్కడ ఉన్నాయి. కానీ మెరుగుపడలేదు. దీంతో గ్రామంలో పెద్దల దృష్టికి సైతం పిల్లలు తీసుకెళ్లిన సందర్భాలు ఉన్నాయి. పాఠశాల పరిస్థితి దారుణంగా తయారవ్వడానికి కారణమైన వారిపై చర్యలు తీసుకొని, సక్రమమైన మార్గంలో నడిపేందుకు ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

బోధన సక్రమంగానే సాగుతోంది..



బోధన సక్రమంగా సాగుతోంది. గత ఏడాది పదో తరగతి విద్యార్థులు 81 మంది పబ్లిక్ పరీక్షలకు హాజరవ్వగా 55 మంది ఉత్తీర్ణులయ్యారు. ఈ ఏడాది కూడా రెగ్యులర్ తరగతులతోపాటు రెమెడియల్ క్లాసులు నిర్వహిస్తున్నాం. ఉపాధ్యాయుల్లో కొందరు డిప్యుటేషన్‌లో, కొందరు శిక్షణకు, మరికొందరు సెలువులో ఉన్నారు. –కిశోర్ ఖడంగా, ప్రస్తుత పాఠశాల నిర్వాహక ఉపాధ్యాయుడు

తరగతి గదుల నిర్వహణ దారుణం



తరగతి గదుల నిర్వహణ దారుణంగా ఉంది. గదుల్లోకి పావురాలు ప్రవేశించి, రెట్టలు వేయడం, ఎక్కడ చూసినా వాటి వెంట్రుకలు పడటంతో అస్తవ్యస్తంగా ఉంటుంది. స్వీపర్లు పట్టించుకోవడం లేదు. వారికి ఇష్టం వచ్చినప్పుడు తుడుస్తున్నారు. దుర్వాసనతో తరగతి గదుల్లో ఉండలేకపోతున్నాం. –బుడ్డెపు పల్లవి, 8వ తరగతి, మఠం సరియాల్లి ఉన్నత పాఠశాల

విద్యార్థులు రోడ్డెక్కారు



పాఠశాలలో చదువులు సక్రమంగా సాగడం లేదు. విద్యార్థులు విసుగు చెంది ఈ విద్యా సంవత్సరంలో పాస్ అవ్వుతామోలేదనే భయాందోళనకు గురౌతున్నారు. పాఠశాల పూర్తిగా అదుపుతప్పిందని, బాగుచేసి న్యాయం చేయాల్సిందిగా గ్రామ పెద్దల్ని ఇంటింటికీ వచ్చి వేడుకొన్నారు. ఉన్నతాధికారులు దృష్టిసారించి చర్యలు చేపట్టాలి. –కొణపల సురేష్, సర్పంచ్, మఠం సరియాపల్లి పంచాయతీ

వైఎస్సార్‌సీపీ బలోపేతమే లక్ష్యం



కవిటి: సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సాయిరాజ్, ఎమ్మెల్సీ రామారావు, పరిశీలకులు లక్ష్మణరావు

- ఉద్యమంలా కోటి సంతకాల సేకరణ
- పార్టీ నాయకులు లక్ష్మణరావు, సాయిరాజ్, రామారావు

కవిటి: రానున్న సాధారణ ఎన్నికలలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల విజయం, పార్టీ బలోపేతానికి కృషి చేసిన వారికి సముచితమైన గుర్తింపు, గౌరవం జగన్ 2.0లో కచ్చితంగా లభిస్తుందని శ్రీకాకుళం పార్లమెంటరీ పార్టీ పరిశీలకులు దుంపల రామారావు (లక్ష్మణరావు) అన్నారు. కవిటిలో మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్ అధ్యక్షతన ఇచ్ఛాపురం నియోజకవర్గస్థాయి పార్టీ విస్తృత స్థాయి సమావేశం శుక్రవారం జరిగింది. సాయిరాజ్ మాట్లాడుతూ.. పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సూచించిన మేరకు గ్రామ, మండల, జిల్లా స్థాయి వరకు వ్యవస్థాగత బలోపేతానికి కమిటీల ఏర్పాటు ప్రధాన ఎజెండాగా అందరూ గుర్తించాలని కోరారు. 2019 నుంచి 2024 వరకు మాజీ సీఎం జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన 17 ప్రభుత్వ వైద్య కాలేజీలను ప్రైవేట్ పరం చేయాలనే కూటమి ప్రభుత్వ విధానంపై వైఎస్సార్‌సీపీ తీవ్రస్థాయిలో పోరాటం చేస్తుందని అన్నారు. పీపీపీ విధానంలో ప్రైవేటుకు ధారాదత్తం చేయడానికి కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి వ్యతిరేకంగా చేపట్టనున్న కోటి సంతకాల సేకరణ ఉద్యమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని పార్టీ పరిశీలకులు లక్ష్మణరావు పిలుపునిచ్చారు. నియోజకవర్గంలో 65 వేల సంతకాల సేకరణ లక్ష్యంగా ఇచ్ఛాపురం మున్సిపాలిటీ, కవిటి, కంచిలి సోంపేట, ఇచ్ఛాపురం మండలాల్లో సంతకాల సేకరణ కార్యక్రమం ప్రజా ఉద్యమంగా నిర్వహించాలని సమావేశంలో నిర్ణయించారు. శుక్రవారం నుంచి నవంబర్ 22వ తేదీ వరకు ఈ కార్యక్రమం నిర్వహణకు శ్రీకారం చుట్టినట్లు పేర్కొన్నారు. దీనికి సంబంధించి ఈ నెల 28న నియోజకవర్గ కేంద్రంలో ర్యాలీ చేస్తామన్నారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి నర్తు నరేంద్రయాదవ్ మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో వైద్యవిద్యను పేద విద్యార్థులకు అప్పటి ముఖ్యమంత్రి జగన్ అందుబాటులోకి తెచ్చారన్నారు. కానీ నేటి కూటమి ప్రభుత్వం దాన్ని ధనార్జనకు మార్గంగా పెత్తందార్లకు చేరువగా తీసుకువెళుతోందన్నారు. ఎమ్మెల్సీ నర్తు రామారావు మాట్లాడుతూ.. కోటి సంతకాల సేకరణ, పార్టీ సంస్థాగత కమిటీల ఏర్పాటు కార్యక్రమాలను అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపడదామన్నారు. పార్టీ పటిష్టతకు కమిటీల ఏర్పాటు ఎంతో కీలకమని అన్నారు. ఈ సందర్భంగా కోటి సంతకాల సేకరణ ఉద్యమం వాల్‌పోస్టర్లను నాయకులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు ప్రత్తి అవినాష్, ఉలాల భారతీదివ్య, నాలుగు మండలాల ఎంపీపీలు కడియాల పద్మప్రకాష్, డాక్టర్ నిమ్మన దాస్, పైల దేవదాస్‌రెడ్డి, బోర పుష్ప, నాయకులు ఇప్పిలి కృష్ణారావు, ఉప్పాడ రాజు, తడక జోగారావు, కె.మోహనరావు, పి.నీలాచలం, పి.లక్ష్మణరావు, రాంపత్ని చిట్టిబాబు, బి.నాగు, జల్లు యుగంధర్, నర్తు ప్రేమ్, కర్రి గోపయ్య, దువ్వు వివేకానందరెడ్డి, బి.శ్రీకృష్ణ, భాస్కరరావు, పి.కామేష్, కాళ్ల మదన్, కాళ్ల సత్యం, జగన్, డొక్కరి బలరాం, లడ్డు కేశవపాత్రో, ఎంపీటీసీ, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ధైర్య సాహసాలు ప్రదర్శించాలి



బాలికా దినోత్సవంలో కళాశాల సిబ్బంది

టెక్కలి: బాలికలు విద్యతో పాటు సామాజిక బాధ్యత, సత్ప్రవర్తన, ధైర్య సాహసాలు ప్రదర్శించాలని టెక్కలి ఎంజేపీ ఏపీ బాలికల పాఠశాల ప్రిన్సిపాల్ పి.సుధారాణి కోరారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మహిళా సాధికారత విభాగం ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ టి.గోవిందమ్మ నేతృత్వంలో శుక్రవారం అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సుధారాణి మాట్లాడుతూ.. నేటి తరంలో జరుగుతున్న వివిధ రకాల పరిణామాలతో బాలికలు జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. ప్రాథమిక హక్కులు తెలుసుకోవాలని, మోస పూరితమైన చర్యలకు దూరంగా ఉండాలన్నారు. మహిళా సాధికారత విభాగం ప్రతినిధులు సీహెచ్ లీలాపద్మజ, ఎన్ఎస్ఎస్ పీవోలు డి.వాసు, కె.గొల్ల, అధ్యాపకులు ఎ.రామారావు, రత్నకళ, కాశీరత్నం, పల్లవి, రెయ్యమ్మ, హిమ, దుర్గాబాయి పాల్గొన్నారు.

మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణపై..

గ్రామ స్థాయిలో ఉద్యమం



టెక్కలి: పెద్దబమ్మిడిలో సంతకాల సేకరణ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న పేరాడ తిలక్, నాయకులు

- వైఎస్సార్‌సీపీ టెక్కలి ఇన్‌చార్జి తిలక్

టెక్కలి: డాక్టర్ కావాలనే పేద, సామాన్య వర్గాలకు చెందిన పిల్లల ఆలోచనలను నాశనం చేసే విధంగా కూటమి ప్రభుత్వం చేస్తున్న కక్షపూరిత చర్యలపై గ్రామ స్థాయిలో ఉద్యమించాలని వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్ కోరారు. గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన మెడికల్ కళాశాలలను ప్రైవేట్‌పరం చేయడానికి కూటమి ప్రభుత్వం చేస్తున్న కుట్రలను తిప్పి కొట్టే విధంగా వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు శుక్రవారం కోటబొమ్మాళి మండలం చిన్నబమ్మిడి, పెద్దబమ్మిడి, ఎత్తురాళ్లపాడు తదితర గ్రామాల్లో రచ్చబండ కార్యక్రమాన్ని నిర్వహించి కోటి సంతకాల సేకరణ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తిలక్ మాట్లాడుతూ.. గత వైఎస్సార్‌సీపీ పాలనలో రాష్ట్రంతో పాటు ఇతర రాష్ట్రాల్లో సైతం ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ వర్తించే విధంగా అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేశారని గుర్తు చేశారు. అంతే కాకుండా గ్రామ స్థాయిలో పేద, సామాన్య వర్గాలకు పూర్తి స్థాయిలో వైద్యాన్ని అందుబాటులోకి తీసుకువచ్చారన్నారు. డాక్టర్ కావాలనే ఆలోచన కలిగిన పేద, సామాన్య వర్గాలకు చెందిన పిల్లలకు వారి లక్ష్యం నెరవేరే విధంగా కొత్త మెడికల్ కళాశాలలను ఏర్పాటు చేశారని చెప్పారు. అటువంటి మెడికల్ కళాశాలలను ప్రైవేట్ వ్యక్తులకు దారాధత్తం చేయడానికి చంద్రబాబు ప్రభుత్వం కుట్ర చేస్తోందన్నారు. ఇప్పటికే ఆరోగ్యశ్రీ సేవలను నిలిపివేశారని ఆవేదన వ్యక్తం చేశారు. పేద వాడికి అందాల్సిన వైద్యం, పేద విద్యార్థులకు డాక్టర్ కావాలనే ఆలోచనను నాశనం చేయాలని చూస్తున్న కూటమి ప్రభుత్వం కుట్రపై గ్రామ స్థాయిలో అవగాహన కల్పించాలని కోరారు. పార్టీ మండల అధ్యక్షుడు ఎస్.హేమసుందర్‌రాజు, జిల్లా ఉపాధ్యక్షుడు అన్నెపు రామారావు, జెడ్పీటీసీ సభ్యుడు దుబ్బ వెంకట్రావు, నందిగాం ఎంపీపీ ఎన్.శ్రీరామ్మూర్తి, నాయకులు మెండ తాతయ్య, మెండ జగన్, వాన అసిరినాయుడు, తలగాన గణపతిరావు, లక్ష్మణరావు, సోమేశ్వరరావు, అనసూయ, చలపతి, ఎస్.వినోద్, పి.వెంకట్రావు, బి.దివాకర్, జనార్దన్‌రెడ్డి, డి.రామకృష్ణారెడ్డి, కె.సంజీవ్, జి.చిరంజీవి, హెచ్.గోవింద్, వెంకటరమణమూర్తి, విష్ణు, చిన్నారావు, లోకేష్, బి.వెంకటరమణ, కె.విశ్వనాథ్‌రెడ్డి, శివారెడ్డి, వి.అప్పారావు, పి.మోహన్, ఎ.గున్నయ్య, టి.మాధవ్, వి.జనార్దన్, డి.సింహాచలం పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

ఇచ్ఛాపురం రూరల్: తేలుకుంచికి చెందిన వెంకటలక్ష్మి అనారోగ్యంతో మృతి చెందింది. ఆమెకు ఇద్దరు కుమార్తెలు. ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న బాలికలకు సన్యాసిపుట్టుగకు చెందిన హెల్పింగ్ హ్యాండ్ ఆర్గనైజేషన్ సంస్థ సభ్యులు రూ. ఐదు వేల నగదును అందజేయడంతో పాటు బాలికల చదువు కోసం ప్రతీ నెల రూ.వెయ్యి చొప్పున సాయం అందజేయనున్నట్టు ప్రకటించారు.

నేడు వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ స్థాయి సమావేశం

పలాస: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పలాస నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశాన్ని శనివారం మధ్యాహ్నం మూడు గంటలకు కాశీబుగ్గ కీర్తన ఫంక్షన్ హాల్‌లో నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ కార్యాలయం ప్రగతి భవన్ నుంచి శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేసింది. మాజీ మంత్రి, పలాస నియోజకవర్గం సమన్వయకర్త డాక్టర్ సీదిరి అప్పలరాజు ఆధ్వర్యంలో జరగనున్న సమావేశానికి పార్టీ కార్యకర్తలు, బూత్ కన్వీనర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, మున్సిపల్ కౌన్సిలర్లు, పార్టీ మండల అధ్యక్షులు, ఎంపీపీలు, జెడ్పీటీసీ సభ్యులు, వివిధ సంఘాల అనుబంధ విభాగాల అధ్యక్షులు, సీనియర్ నాయకులు హాజరు కావాలని కోరారు. సమావేశంలో డిజిటల్ బుక్ ఆవిష్కరణ, నూతన కమిటీల నిర్మాణంపై అవగాహన, మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణపై రచ్చబండ, సంతకాల సేకరణపై దిశానిర్దేశం ఉంటుందన్నారు.

జీఎస్టీపై అవగాహన కల్పించాలి

కంచిలి: జీఎస్టీ తగ్గుదలతో మార్కెట్‌లో ఏపీ ఉత్పత్తుల్లో ధరలు తగ్గాయనే అంశంపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి అధికార యంత్రాంగాన్ని, సర్పంచ్‌లను కోరారు. ఈ మేరకు మండల పరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడారు. జీఎస్టీ తగ్గుదలతో ధరలు తగ్గిన వస్తువులను కమర్షియల్ ట్యాక్స్ వారు ప్రదర్శించి అవగాహన కల్పించారు. ఎంపీడీవో వి.తిరుమలరావు, ఏసీటీవో కాశీప్రసాద్, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, వీవోఏలు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: జీఎస్టీపై మున్సిపల్ కార్యాలయం ఆవరణలో కమిషనర్ ఎన్.రమేష్ ఆధ్వర్యంలో అవగాహన నిర్వహించారు. ఎలక్ట్రికల్ సామగ్రి ధరల తగ్గుదలను వివరించారు. అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ టాక్స్ కాశీబుగ్గ కాశీప్రసాద్ పాల్గొన్నారు.

కుంకుమ పూజలు..

ఇచ్ఛాపురం : ఇచ్ఛాపురం మున్సిపాలిటీ పరిధిలోని రత్తకన్న నాయుడు వీధిలో గజలక్ష్మి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా శుక్రవారం నిర్వహించిన కుంకుమ పూజల్లో 140 మంది మహిళలు పాల్గొన్నారు. పండితులు ప్రకాష్‌పండా, శివరామ్‌పండా పర్యవేక్షణలో పూజలు జరిగాయి.



కుంకుమ పూజల్లో మహిళలు



మందుబాబులకు అడ్డాగా మారుతున్న పాత హైస్కూల్ గదులు



అసాంఘిక కార్యకలపాలకు అడ్డాగా మారిన సగం నిర్మాణంలో ఉన్న వసతి గృహం భవనాలు



పోకిరీలకు నిలయంగా మారిన పాత జిల్లా ఆస్పత్రి గదులు

వృథా భవనాలు..

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాలు!

టెక్కలి రూరల్: టెక్కలి పట్టణ పరిధిలోని పలు ప్రాంతాలు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా ఖాళీగా ఉన్న వివిధ భవనాలు చీకటి పనులకు నిలయాలుగా మారుతున్నాయి. పాత హైస్కూల్ భవనాలు, పాత జిల్లా ఆస్పత్రి భవనాలు, హుద్‌హుద్ బాధితుల కోసం నిర్మంచిన ఇళ్లు, అసంపూర్తిగా ఉన్న రైతు బజార్, ఆంజనేయపురం సమీపంలో అసంపూర్తిగా వదిలేసిన వసతిగృహం, జగతిమెట్ట తదితర ప్రాంతాలను చాలామంది పట్టపగలే చీకటి వ్యవహారాలకు వాడుకుంటున్నారు. రైల్వేట్రాక్ పక్కగా టెక్కలి సబ్‌కలెక్టర్ కార్యాలయానికి సమీపంలో ఉన్న పాత హైస్కూల్ గదులను మందు బాబులు పాడు చేస్తున్నారు. నిరుపయోగంగా మారిన పాత జిల్లా ఆస్పత్రి భవనాలు సైతం పోకిరీకలు నిలయాలు ఉన్నాయి. హుద్‌హుద్ ఇళ్లు పూర్తిస్థాయిలో పంపిణీ చేయకపోవడంతో ఖాళీగా ఉన్న గృహాల్లో చొరబడుతున్న ఆకతాయిలు వాటి కిటికీలు, తలుపులు పగలగొట్టి లోనికి వెళ్లి చీకటి పనులకు వాడుకుంటున్నారు. ఆజనేయపురం వద్ద వసతి గృహం కోసం నిర్మాణం చేపట్టి వదిలేసిన బిల్డింగ్‌లో అసాంఘీక కార్యకలాపాలు, మద్యం ప్రియులు వారికి అనుకూలంగా వాడుకుంటున్నారనే విమర్శలు వస్తున్నాయి. పోలీసు అధికారులు వీటిపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయాలి



మాట్లాడుతున్న అనంతాచార్యులు

ఇచ్ఛాపురం: ఉపాధ్యాయులను బోధనకు మాత్రమే పరిమితం చేయాలని ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్.వి.అనంతాచార్యులు డిమాండ్ చేశారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ఏపీటీఎఫ్ మండల సర్వసభ్య సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఉపాధ్యాయులను యాప్‌ల బాధ నుంచి విముక్తి చేయాలని కోరారు. ఇటీవల పాఠశాలల్లో నిర్వహిస్తున్న జీఎస్టీ 2.0, స్వచ్ఛతాసేవా వంటి బోధనేతర కార్యక్రమాల కారణంగా విద్యార్థులు చాలా నష్టపోతున్నారని అన్నారు. ఏపీటీఎఫ్ మండల అధ్యక్షుడు పి.శంకర్, ప్రధాన కార్యదర్శి జి.ఉమా శంకర్, సంఘ ప్రతినిధులు కె.సత్యమయ్య, పి.కామరాజు, సీహెచ్ వెంకటరమణ, కె.నీలకంఠం, శశిభూషణ్‌గౌడో పాల్గొన్నారు.

ఆవేదన తీరింది!

- గత సర్కార్ హయాంలో రూ. 1.81 కోట్లతో రోడ్డు, బ్రిడ్జి నిర్మాణం
- ఆనందంలో పుచ్చపాడు గ్రామస్తులు

మందస: పీతాతోళి పంచాయతీ పుచ్చపాడు గ్రామస్తులు చినుకుపడితే వణికిపోయేవారు. వర్షా కాలంలో బాహ్య ప్రపంచంతో రోజుల తరబడి సంబంధాలు తెగిపోయేవి. రోడ్డు సదుపాయం లేక తీవ్రమైన ఇబ్బందులు పడేవారు. ఇలాంటి సమస్యకు గత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో పరిష్కారం లభించింది. గ్రామ సర్పంచ్ చింతాడ గణపతి సమస్యను అప్పటి మంత్రి, పలాస ఎమ్మెల్యే డాక్టర్ సీదిరి అప్పలరాజు దృష్టికి తీసుకెళ్లారు. ఆయన స్పందించి ఉన్నతాధికారులతో మాట్లాడి 1.81 కోట్ల రూపాయలను మంజూరు చేయించారు. ఈ నిధులతో మందస బీటీ రోడ్డును అనించుకొని పుచ్చపాడు గ్రామం వరకు సీసీ రోడ్డుతోపాటు మధ్యలో బ్రిడ్జి నిర్మాణాన్ని చేపట్టారు. దీంతో సమస్య పరిష్కారం కావడంతో గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ నెల మొదటి వారంలో కురిసిన భారీ వర్షంతో సంభవించిన వరదల సమయంలో కూడా పుచ్చపాడు గ్రామానికి ఎలాంటి వరద ముప్పు లేకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.



వర్షకాలంలో జలమయమైన పుచ్చపాడు రోడ్డు (ఫైల్)



నూతనంగా నిర్మించిన బిడ్జి

ఇబ్బందుల్లేవు..



మా పంచాయతీ పరిధిలోని పుచ్చపాడు గ్రామస్తులు గతంలో చాలా ఇబ్బందులు పడ్డారు. రోడ్డు లేక వర్షాకాలంలో పడరాని పాట్లు పడ్డారు. గత ప్రభుత్వ హయాంలో పలాస ఎమ్మెల్యే సీదిరి అప్పలరాజు కృషితో సీసీ రోడ్డు, బ్రిడ్జి నిర్మాణం చేపట్టడంతో ఇప్పుడు ఎలాంటి ఇబ్బందుల్లేవు. –చింతాడ గణపతి, పితాతోళి సర్పంచ్

వర్షం పడితే వణుకే..



మా గ్రామానికి సరైన రోడ్డు సదుపాయం ఉండేదికాదు. వర్షకాలం వస్తే ఏరు దాటి వెళ్లడానికి ఇబ్బంది పడేవాళ్లం. గత ప్రభుత్వం హయాంలో రోడ్డు, బ్రిడ్జి నిర్మాణం జరగడంతో ఇబ్బందులు తొలగిపోయాయి. – అంపోలు కిరణ్‌కుమార్, పుచ్చపాడు